'అండర్'పాస్!

- తక్కువ ఎత్తులో ఎన్‌హెచ్‌340సీ అండర్‌పాస్‌ల నిర్మాణం
- వర్షం వస్తే మోకాళ్లలోతు నిలుస్తున్న నీరు
- ఇబ్బందులుపడుతున్న విద్యార్థులు, రైతులు, సీడ్‌ఫాం అధికారులు
- పంట ఉత్పత్తులు తరలించేందుకు అవస్థలు

జూపాడుబంగ్లా: నేషనల్‌హైవే 340సీ రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లు, అధికారులు ఇష్టారాజ్యంగా అండర్ పాస్ వంతెలను నిర్మించటంతో సీడ్‌ఫాం అధికారులు, విద్యార్థులు, రైతులు, తాటిపాడు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అండర్‌పాస్‌లను తక్కువ ఎత్తులో నిర్మించడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీళ్లు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అంతేకాకుండా రైతులు పండించిన ధాన్యాన్ని తీసుకెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది.

మండ్లెం వద్ద విద్యార్థులకు అవస్థలు

మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆ గ్రామ రైతులు పొలాలకు వెళ్లేందుకు పాఠశాలకు ఎదురుగా లోలెవెల్ అండర్‌పాస్ నిర్మించారు. అలాగే తంగడంచ సీడ్‌ఫారానికి వెళ్లే దారిలో తక్కువ ఎత్తులో అండర్‌పాస్ నిర్మించారు. తాటిపాడు గ్రామానికి అడ్డంగా ఎన్‌హెచ్ 340సీ రోడ్డు నిర్మించగా గ్రామానికి వెళ్లేందుకు గ్రామ సమీపంలో అండర్‌పాస్‌ను నిర్మించారు. హైవేరోడ్డు నిర్మాణ పర్యవేక్షణ అధికారుల లోపం వల్ల కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఈ అండర్‌పాస్‌లను లోలెవెల్‌లో (తక్కువ ఎత్తులో) నిర్మించారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మోకాళ్లలోతు వర్షం నీళ్లు నిలిచిపోతున్నాయి.

ఇబ్బందుల్లో రైతులు

లోలెవెల్ అండర్‌పాస్ వంతెనల కింద ఎద్దుల బండ్లు, పశుగ్రాసం, దాన్యం తరలించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం 18మీటర్ల ఎత్తు మేర నిర్మించాల్సిన అండర్‌పాస్‌లను కేవలం 10 నుంచి 12అడుగుల ఎత్తులో మాత్రమే నిర్మించారు. దీనికితోడు రోడ్డు కంటే తక్కువ ఎత్తులో అండర్‌పాస్‌లు నిర్మించటం వల్ల చిన్నపాటి వర్షం కురిసినా వర్షం నీళ్లన్నీ అండర్‌పాస్ వంతెన కింద నిలిచిపోతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. వర్షం నీళ్లు నిలువకుండా ఎత్తుపెంచినట్లయితే ఎద్దులబండ్లు, లారీలు, ట్రాక్టర్లు వంతెన కింద నుంచి వెళ్లలేవని వాపోతున్నారు. దీంతో మండ్లెం వద్ద 200ఎకరాల రైతులు, తంగడంచ వద్ద 350ఎకరాల రైతులు, తంగడంచ ఫారం వద్ద 250ఎకరాల రైతులు, తాటిపాడు గ్రామంలో 500ఎకరాల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై నాలుగు రోజుల క్రితం మండ్లెం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామ రైతులు ఆర్డీఓ నాగజ్యోతికి కూడా ఫిర్యాదు చేశారు. తాటిపాడు గ్రామానికి అడ్డంగా గోడకట్టినట్లుగా ఎన్‌హెచ్ 340సీ రోడ్డును నిర్మించారు. దీంతో గ్రామస్తులు తమ గ్రామానికి వెళ్లేందుకు నిర్మించిన లోలెవెల్ అండర్‌పాసు వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయని గ్రామానికి సర్వీసురోడ్డు నిర్మించాలని ఇటీవల జేసీ విష్ణుచరణ్‌ను కోరారు.


తంగడంచ ఫారానికి వెళ్లే మార్గంలో లోలెవెల్ అండర్‌పాస్ కింద మోకాళ్లలోతు నిలిచిన వర్షపు నీరు


మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద తక్కువ ఎత్తులో నిర్మించిన అండర్‌పాస్ బ్రిడ్జి

పొలాలకు సర్వీసు రోడ్డు నిర్మించాలి



పొలాలకు వెళ్లకుండా అడ్డంగా ఎన్‌హెచ్‌340సీ రోడ్డును నిర్మించారు. తంగడంచ ఫారానికి సమీపంలో 200ఎకరాల పొలం ఉంచి ఎన్‌హెచ్340సీ రోడ్డు నిర్మాణం వల్ల పొలాలకు వెళ్లేందుకు రైతులం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఎక్కడో రెండు కిలోమీటర్ల దూరంలో అండర్‌పాస్ వంతెనను నిర్మించారు. దానివల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు. పోలీసుస్టేషన్ నుంచి తంగడంచ ఫారం రోడ్డు వరకు సర్వీసు రోడ్డు నిర్మించి రైతులను ఆదుకోవాలి.

– మహేశ్వరరెడ్డి, రైతు, జూపాడుబంగ్లా

లోలెవెల్ వంతెనతో ఇబ్బంది

రాష్ట్రంలో ఎంతో పేరొందిన తంగడంచ సీడ్‌ఫారానికి వెళ్లే మార్గంలో లోలెవెల్ అండర్‌పాస్‌ను నిర్మించారు. రోడ్డుకంటే వంతెన తక్కువగా ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా మోకాళ్లలోతు వర్షం నీళ్లనిలుస్తున్నాయి. అందులో నడిచివెళ్లాలన్నా, కార్లు వెళ్లాలన్నా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు చర్యలు తీసుకొని పోలీసుస్టేషన్ నుంచి ఫారం వరకు సర్వీసు రోడ్డు నిర్మిస్తే ఫారానికి సులభంగా రాకపోకలు జరుగుతాయి.

–అరుణలత, ఏడీఏ, తంగడంచ ఫారం

అడిగిన వారందరికీ ఉపాధి పనులు


మాట్లాడుతున్న ఏపీఓ గౌరీబాయి

జూపాడుబంగ్లా: అడిగిన వారందరికీ వెంటనే ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ గౌరీబాయి తెలిపారు. సోమవారం మండలంలోని తాటిపాడు గ్రామంలో సర్పంచ్ వంగల లక్ష్మిదేవి అధ్యక్షతన ఉపాధి హామీ పనుల నిర్వహణపై గ్రామసభను నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ తాటిపాడు గ్రామంలో అనివార్య కారణాల వల్ల ఉపాధి పనులు నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు మళ్లీ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామంలో పనులు నిలిపివేయాలని ఎవరు చెప్పారో తెలపాలంటూ గ్రామస్తులు ఏపీఓను ప్రశ్నించటంతో ఆమె సరైన సమాధానం చెప్పకుండా దాటవేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వెంటనే గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్నామని, పనులు కావాల్సిన కూలీలు గ్రామ ఫీల్డ్‌అసిస్టెంటుకు డిమాండ్ నోటీసు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ నజీర్, కార్యదర్శి తిప్పన్న, టీఏ చిన్న, ఫీల్డ్‌అసిస్టెంటు లింగన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు 'చెన్నుపాటి'

నందికొట్కూరు: ఉపాధ్యాయ ఉద్యమ పితామహులు చెన్నుపాటి లక్ష్మయ్య అని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముర్తుజావలి అన్నారు. సోమవారం పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయం ప్రాంగణంలో చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం చెన్నుపాటి నిరంతరం పోరాటం చేసిన మహానీయుడన్నారు. చెన్నుపాటి ఆశయ సాధన కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఆరోగ్యం బాగలేకపోయిన ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాటం చేశారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సత్యనారాయణ, వాసు, జగదీష్, అబుఖాసీం, బాలనరసింహుడు, వెంకటరాముడు, శివకుమార్, వెంకటేశ్వర్లు, ఆసీఫ్అలీ, తదితరులు పాల్గొన్నారు.


చెన్నుపాటి లక్ష్మయ్య చిత్ర పటం వద్ద జోహార్లు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నారాయణస్వామి ఆశయాలను కొనసాగిద్దాం


నారాయణస్వామి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నందికొట్కూరు: నారాయణస్వామి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి నరసింహులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నారాయణస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఒంగోలు జిల్లాలో పుట్టిన ఆయన విద్యార్థి దశలోనే ఉద్యమబాట పట్టారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసి ఎన్నో నిర్బంధాలు, జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. ఒంగోలు శాసన సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా సేవలందించారని చెప్పారు. కార్యక్ర మంలో ఆ పార్టీ నాయకులు గోపాలు, వెంకటేశ్వర్లు, ఎల్లనాయుడు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో జిల్లాను అగ్రభాగాన నిలుపుదాం

నంద్యాల: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అములులో అధికారుల బృందాలు సమన్వయంతో పని చేసి అన్ని పారామీటర్లలో జిల్లాను ముందు స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో కో–ఆర్డినేషన్ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డీఆర్‌డీఏ, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఇతర శాఖలు ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్య సాధనలో వెనుకబడిన అంశాలను తన దృష్టికి తీసుకొచ్చి సమీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వరి, ఇతర ధాన్యపు పంట దిగుబడులను రోడ్లపై ఆరబోస్తున్నారని అకాల వర్ష కారణంగా ధాన్యం తడవకుండా రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ– పంట, బీమా ప్రీమియం చెల్లింపు కింద వివిధ పంటలకు తక్కువ రుసుమును ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లిస్తే దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లిస్తుందన్న అంశాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. తొలిరోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై 430 గ్రీవెన్స్ వచ్చాయని వీటన్నింటిని ఆన్‌లైన్ చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం జరిగిన జెడ్పీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన దొర్నిపాడు బాయ్స్ హాస్టల్ సమీపంలో ఉన్న వైన్ షాపుపై చేసిన ఫిర్యాదును పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాల కేంద్రం సోమవారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, గ్రంథాలయ శాఖాధికారి కృష్ణరెడ్డి విక్రయానికి ఉంచిన కూరగాయలు, ఆకుకూరలు పరిశీలించి కొనుగోలు చేశారు. అధికారులు మాట్లాడుతూ రసాయనాలు వినియోగించకుండా పండించిన ఉత్పత్తులను తినడం వల్ల ఆరోగ్యకరమైన ఆహారం, మనకు కావాల్సిన రోగనిరోధక శక్తి లభిస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలు పండించిన మహిళా రైతులు హలిమా సుల్తానా, పుష్పలతలను అధికారులు అభినందించారు.

ప్రకృతి పద్ధతిలో పంటసాగు అలవర్చుకోవాలి

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించి పంటలు సాగు చేయటం అలవర్చుకోవాలని రైతు సాధికారిక సంస్థ కమ్యూనిటీ డిజిటల్ ఇంటన్ నూతన్, ఐసీఆర్‌పీఎస్‌లు రాధిక, వెంకటశేషమ్మ, పార్వతి, జయమ్మ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు.


ప్రకృతి విధానంలో పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న మండల అధికారులు

పంటల బీమా చేయించుకోవాలి

జూపాడుబంగ్లా: రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం జూపాడుబంగ్లా స్థానిక రైతు ఉత్పత్తిదారుల కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఈనెల 15లోగా రైతులు రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. పంటల బీమా చేయించుకోవటం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. పంటలబీమా చేయించుకోకపోతే నష్టపరిహారం మంజూరు కాదన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అంబమ్మ, సీసీ కరుణాకర్, రైతులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలి

కొత్తపల్లి: దుద్యాల గ్రామంలోని ఎస్సీ కాలనీలలో నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఈ.రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలోలో ఎంపీడీఓ మేరికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ దుద్యాల గ్రామంలోని మాదిగ, మాల కాలనీలలో పంచాయతీ వారు నేరుగా పైపుల ద్వారా నీటి సరఫరా చేయిస్తున్నారన్నారు. దీని ద్వారా నీరు వృథా అవ్వడంతో పాటు నీరు రోడ్లవెంట పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీ వారు గ్రామంలో ఇకపై రెండు రోజులకు ఒకసారి మాత్రమే నీటి విడుదల జరుగుతుందని దండోరా వేశారన్నారు. దీనివల్ల ఎస్సీకాలనీల ప్రజలు వేసవిలో నీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. కాలనీలలో నీటిట్యాంకులు ఏర్పాటుచేసి నీటి కష్టాలు తీర్చాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలి

కొత్తపల్లి: అదానీ గ్రూపు కంపెనీల అవినీతి, క్రోనీ కాపీటలిజాన్ని ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని, ఇందుకోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కేతం వెంకటశివుడు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ మండల కమిటీ సమితి ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డ్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం అదానీ సంస్థలకు మేలు జరిగే విధంగా నడుచుకుంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు భీమలింగం, బాలకృష్ణ, లింగమయ్య, మహేష్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఆత్మకూరు: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ ఎంఎస్ నంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, ప్రసాద్, పెద్దనాగరాజు, తిమ్మయ్య కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణవాసులకు సేవలందిస్తున్న కార్మికులకు పనికి తగ్గ వేతనం అమలు చేయాలని కోరారు. టీఏ, డీఏ, రిస్క్ అలవెన్స్‌లు చెల్లించాలని, అర్హులైన వారికి ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు బాలరాజు, అశోక్, గొడుగు రాజు, జోషఫ్, చిన్న నాగరాజు, వసంతరాజు, ఖాజా ఉన్నారు.

పంట కాలువను గుర్తించండి

పాములపాడు: ప్రభుత్వ పంట కాలువలను గుర్తించి న్యాయం చేయాలని కోరుతూ రైతులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ప్రజా సంఘాల నాయకుడు స్వాములు మాట్లాడుతూ మండలంలోని రుద్రవరం గ్రామంలో గుడి వద్ద పంట కాల్వను పూడ్చేశారన్నారు. ఈ పంట కాల్వను అధికారులు గుర్తించకపోవడం వలన సుమారు 25 ఎకరాల్లో పంటలు నాశనం అవుతున్నాయని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో రైతాంగం తీవ్ర నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. రైతులు రామకృష్ణ, పెద్ద శివుడు, శాలు, శివ, మల్లికార్జున, శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు పింఛన్లను అందించాలి

ఆత్మకూరు: ఎటువంటి ఆదరణ లేని ఒంటరి మహిళలకు ప్రభుత్వ సామాజిక పింఛన్లు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు జవహర్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల భర్తలకు దూరమై పిల్లలతో జీవిస్తున్న మహిళలకు పోషణ భారమై తమ పిల్లలను చదివించుకోలేక, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వారిని ప్రభుత్వం గుర్తించి పింఛన్లను అందించాలని ఆయన కోరారు.

రుద్రవరంలో నేడు రెవెన్యూ సదస్సు

పాములపాడు: మండలంలోని రుద్రవరంలో గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు సోమవారం తెలిపారు. గ్రామంలోని రైతులు పొలాలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు ఇచ్చి పరి ష్కరించుకోవచ్చని చెప్పారు. ఈఅవకాశాన్ని గ్రామ రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన హరికథా గానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన సాయిరామ్ భాగవతార్ ఆత్మలింగ ప్రతిష్ఠ హరికథాగానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మృదంగ, వయోలిన్ సహకారం సాయిచరణ, రమణ అందించారు.

నలుగురిపై కేసు నమోదు

మహానంది: స్థలం విషయంలో జరిగిన ఘర్షణలో గాజులపల్లె గ్రామానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శేఖర్, అతని భార్య, కుమారుడు, కుమార్తె కలిసి దాడి చేయగా తన భర్త రాజగోపాల్, కుమారుడు గాయపడ్డారని అదే గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనందీశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఈఓ వీఎల్ఎన్ రామానుజన్, పర్యవేక్షణ అధికారి హరి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మూడు నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.1,70,176 ఆదా యం లభించిందని తెలిపారు.

కల్యాణం..కమనీయం


కల్యాణోత్సవ పూజలందుకున్న మహానందీశుడి దంపతులు


వేదపండితులు ఆశీర్వచనం అందుకుంటున్న న్యాయమూర్తి ఆదినారాయణ

మహానంది: మహానందీశ్వరుడి దంపతుల కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతశర్మలు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి వేదోక్తంగా పూజలు చేశారు. అక్షింతల మాంగళ్య ధారణ పూజలను భక్తులు తిలకించారు. అంతకు ముందు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయానికి చేరుకుని రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో న్యాయమూర్తి

నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై చిత్తూరు జిల్లా పలమనేరుకు బదిలీపై వెళ్లనున్న ఆదినారాయణ సోమవారం మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు. ఆయన వెంట పీసీలు చంద్రశేఖర్, శేషన్న, కిషోర్‌కుమార్ ఉన్నారు.

వీబీఆర్‌లో చేప పిల్లల విడుదల

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో సోమవారం శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఉచితంగా ఎనిమిది లక్షల చేప పిల్లలను విడుదల చేశామన్నారు. అందులో బొచ్చ ఒక లక్ష, ఎర్ర మోసు మూడున్నర లక్షలు, తెల్ల మోసు మూడున్నర లక్షల చేప పిల్లలతో కలిపి మొత్తం 20 లక్షల చేప పిల్లలు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో విడుదల చేస్తామన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ రాఘవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, మత్స్య అభివృద్ధి అధికారులు పామన్న, భరత్ లాల్ నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి సుంకన్న పాల్గొన్నారు.


చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

సకల శాస్త్రాల సారాంశం భగవద్గీత

నంద్యాల(వ్యవసాయం): భగవద్గీత సకల శాస్త్రాల సారాంశమని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధికారి డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. స్థానిక పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో భగవద్గీత కంఠస్థ పఠన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు నగదుతో పాటు రామాయణ సంగ్రహ గ్రంథాలను అందజేశారు.

అధ్యాపకులు కావాలంటూ రోడ్డెక్కిన విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: అధ్యాపకులు కావాలంటూ శ్రీశైలం గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు సోమవారం రోడ్డెక్కారు. ఉద్యోగ భద్రత, అలవెన్స్‌ల కోసం గురుకుల విద్యాలయాల అవుట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ(అధ్యాపకులు) 23 రోజులుగా విధులకు గైర్హాజరై పోరుబాటు పట్టారు. దీంతో చదువు చెప్పేవారు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో శ్రీశైలం గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు హైవేపైనా, ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మంగళవారంలోగా అధ్యాపకులను ఏర్పాటు చేస్తామని ఐటీడీఏ పీఓ శివకుమార్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.


ధర్నా చేస్తున్న గురుకుల విద్యార్థులు

క్లుప్తంగా

ఆశా వర్కర్లకు ప్రచారబోర్డుల పంపిణీ


ప్రచార బోర్డులను తీసుకెళ్తున్న ఆశా వర్కర్

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'మూలకు చేరిన ప్రచారబోర్డులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ప్రాథమిక వైద్యులు డాక్టర్ గంగాధర్, వైద్యసిబ్బంది స్పందించా రు. ఆసుపత్రిలో మూలకు ఉంచిన ప్రజారోగ్య ప్రచార బోర్డులు, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం వంటి ఆరోగ్య సూత్రాలను తెలియజేసే బోర్డులను పీహెచ్‌సీ పరిధిలోని 22మంది ఆశావర్కర్లను సమావేశపరిచి ఒక్కొక్కరికి ఏడుచొప్పున పంపిణీ చేశారు. వీటిని గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాలు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సంగమేశ్వర శిఖరానికి ప్రత్యేక పూజలు


శిఖరానికి పూజలు చేస్తున్న ఆలయ పురోహితుడు

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయంలో క్రమేపి నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. సోమవారం జలాశయం నీటి మట్టం 864 అడుగులకు చేరుకుంది. దీంతో మండలంలోని సప్తనదీ సంగమ ప్రాంతంలో జాలాధీవాసంలో ఉన్న ప్రాచీన సంగమేశ్వరాలయ శిఖరభాగం బయపడుతోంది. సోమవారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ శిఖరభాగానికి ప్రత్యేక పూజలు చేశారు. శిఖరభాగంపై పరమేశ్వరుడి ప్రతిమను ఉంచి కుంకుమార్చన, పుష్పార్చన, నదీజలాలతో అభిషేకం, మహా మంగళహారతి తదితర విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు.

కోలుకోలేక వ్యక్తి మృతి


వెంకటేశ్వర్లు(ఫైల్)


పగిడ్యాల: 15 రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన లక్ష్మాపురం సర్పంచ్ సుజాత భర్త కొమారి వెంకటేశ్వర్లు(35) చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవల డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నారు. అయితే సోమవారం తెల్లవారుజామున ఫిట్స్ రాగా.. చికిత్స నిమిత్తం నందికొట్కూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణమ్మ, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్, కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపి సంతాపం వ్యక్తం చేశారు.

పోస్టర్ల విడుదల


వాల్‌పోస్టర్ల విడుదల చేస్తున్న ఫాస్టర్లు

ఆత్మకూరు: స్థానిక చర్చి ఆవరణలో సోమవారం యునైటెడ్ క్యాండిల్‌లైట్ సర్వీస్ వాల్‌పోస్టర్లను పాస్టర్లు కలువండి త్యాగరాజు, చిలుక కృపాదనం ఆనంద్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు రమేష్, జయరాజ్, గగద్దల ఫిలోమన్, ఇస్సాక్‌బాబు, త్యాగరాజు, కృపాదానం, ధనపాల్, శామ్యూల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): షటిల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీల్లో స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచి ప్రతిభ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలోని క్రీడాకారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. గత నెల కర్ణాటక రాష్ట్రంలో జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ కాలేజీగేట్ ఉమెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొన్నారని చెప్పారు. ముఖ్యఅతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ రాఘవయాదవ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రెండో స్థానాన్ని కై వసం చేసుకున్న క్రీడాకారులను అభినందించారు. అధ్యాపకులు ఇంతియాజ్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కళాశాలలో సోమవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు.